క్లుప్తంగా

నేడు ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

పుల్లంపేట : శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ ఏఓ శ్రీకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అగ్రికల్చర్, హార్టికల్చర్, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ అధికారులు హాజరు కావాలని కోరారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఓబులవారిపల్లె : అర్హత కల్గిన యువతీ యువకులు ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ ముస్లింలు, బౌద్ధులు, సిక్కు కులానికి సంబంధించిన వారు ఆన్‌లైన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారు అర్హులని, వివరాలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పిడుగుపడ్డ గృహం పరిశీలన


శ్రీనివాసులు రెడ్డి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓబిలి శ్రీనివాసులు రెడ్డి ఇంటి సన్‌సైడ్‌పై పిడుగు పడిన విషయం విధితమే. గురువారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పిడుగుపడ్డ ఇంటిని, విద్యుత్ అధికంగా రావడం వలన విద్యుత్ సామగ్రి కాలిపోయిన గృహాలను పరిశీలించారు. అనంతరం ఓజీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పిడుగుపడినప్పుడు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, అయితే పలు ఇళ్లల్లో ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు కాలిపోయాయన్నారు. దీంతో సుమారు రూ.10 లక్షలు మేర నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో ఓజీ శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవ రెడ్డి, ఎస్‌బి పి.మహేష్ నాయుడు, ఆర్‌బి రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై వెంకన్న


గజవాహనంపై వెంకన్న

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వాహన సేవలకు వాల్మీకి వీధి భక్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, భజన, లలిత సహస్రనామ ప్రవచనాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆశా వర్కర్స్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 30 ,31 తేదీలలో కడపలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ .వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం రాష్ట్ర మహాసభలు జయప్రదాన్ని ఆకాంక్షిస్తూ ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, ఆఫీస్ బారర్లు చాముండేశ్వరి, నాగవేణి, వేదవతి, ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎం.గంగాధర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే.సి. బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

డీడీ శ్రీనివాసులును సస్పెండ్ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలో రిమ్స్‌లో పనిచేస్తున్న అప్కాస్ కార్మికులలో నచ్చిన వారికి ఒక రకంగా.. నచ్చని వారితో మరో రకంగా వ్యవహరిస్తున్న డీడీ శ్రీనివాస్ రావును సస్పెండ్ చేయాలని గురువారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అధ్యక్షులు చంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ రంగ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీడీ శ్రీనివాసులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందుకు నిదర్శనం, ఇటీవల ఒక ఉద్యోగి విధులకు రాకపోయిన రెండు నెలల జీతం చేసిన చరిత్ర డీడీ దేనని తెలిపారు. ఆయనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఊరించే ఊరగాయ

- ఆవకాయ పచ్చడి పెట్టుకునే పనుల్లో గృహిణులు
- అధికమైన మామిడికాయ ధరలు
- అందుబాటులో రిటైల్ పచ్చళ్లు తగ్గిన తయారీ

రాయచోటి జగదాంబ సెంటర్ : వేడివేడి అన్నంలో కాస్త నెయ్యి వేసుకుని ఆవకాయ పచ్చడి(మామిడికాయ ఊరగాయ)తో అన్నం తింటుంటే ఆ రుచే వేరబ్బా. తెలుగు వారి లోగిళ్లలో పచ్చళ్లకు ప్రాధాన్యం ఎక్కువే. మామిడి సీజన్ వచ్చిందంటే పచ్చళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. జిల్లా వ్యాప్తంగా పచ్చళ్లు పెట్టుకోవడంలో ప్రజలు మునిగి తేలుతుంటారు. మార్కెట్లోకి పచ్చడి మామిడి కాయలు విరివిగా వస్తున్నాయి. ప్రతి రోజు ఉదయాన్నే పచ్చడి మామిడికాయ కొనుగోలుదారులతో మార్కెట్‌లు రద్దీగా మారుతున్నాయి. ప్రస్తుతం సీజన్‌లో ప్రతి కుటుంబం ఎంతో కొంత మేర వారి శక్తికి తగ్గట్టుగా పచ్చళ్లు పెట్టుకుంటున్నారు. ఏ పచ్చడి పెట్టినా పెట్టకపోయినా ప్రతి ఒక్కరూ ఆవకాయ, మాగాయి పచ్చడి మాత్రం తప్పనిసరిగా తయారు చేసుకుంటారు. సాధారణంగా కార్తె సీజన్ ప్రారంభం కాకముందే పచ్చళ్లు పెట్టడం పూర్తి చేస్తారు. ప్రస్తుతం దేశవాళి, నూదలు, రసాలు, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, హైదర్‌సాహెబ్ తదితర రకాల మామిడికాయలు మార్కెట్లోకి వస్తున్నాయి. మామిడికాయలను సాధారణ రకాలు రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు నాణ్యమైన రకాలైన హైదర్‌సాహెబ్, కొత్తపల్లి కొబ్బరి వంటి రకాలను రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. కాయ రకం, సైజును బట్టి ధర పలుకుతుంది.

పరిమాణం తగ్గినా..

మామిడికాయల ధరలు అధికంగానే ఉన్నప్పటికీ, పచ్చడిలో వినియోగించే ముడి సరుకులైన గానుగ నూనె, ఎండుమిర్చి, ఆవాలు, మెంతులు, వెల్లుల్లి, ఉప్పు ధరలు గతేడాదితో పోలిస్తే కొంతమేర అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పచ్చడి పెట్టడం భారంగా మారుతోంది. కుంచుడు ముక్కలతో పచ్చడి పెట్టాలంటే దాదాపు రూ.1,500 వరకు ఖర్చవుతుందని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలు, కూలీలు పనులకు వెళ్లే హడావుడి సమయాలలో కూరలకు బదులుగా తమ ఆహారంలో పచ్చడినే వినియోగిస్తారు. మార్కెట్లో వివిధ పరిమాణాల్లో వివిధ రకాల పచ్చళ్లు అందుబాటులోకి రావడంతో సామాన్య ప్రజలు ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చళ్లు పెట్టుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. నాలుక రుచిని చంపుకోలేని వారు మాత్రం ప్రమాణాన్ని తగ్గించుకుని పచ్చళ్లు తయారు చేసుకుంటున్నారు.


మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఊరగాయ మామిడికాయలు


ఊరగాయ తయారీకి సిద్ధంగా ఉన్న మామిడికాయలు


మామిడికాయ ఊరగాయను తయారు చేసిన దృశ్యం

పలు కారణాలతో..

గతంతో పోలిస్తే పచ్చళ్లు పట్టుకునే వారి సంఖ్య ఏడాదికేడాది తగ్గుతోంది. ప్రజల్లో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు, ముడి సరుకుల ధరలు పెరగడంతో పాటుగా అంగట్లో పలు రకాల పచ్చళ్లు దొరకడం కూడా కారణంగా చెబుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ వంటి వ్యాధులు తగ్గడంతో వైద్యుల సలహా మేరకు పచ్చడి తినడాన్ని చాలా మంది తగ్గిస్తున్నారు. పచ్చళ్ల తయారీ కేంద్రాల నుంచి నేరుగా మార్కెట్లోకి అందుబాటులోకి వస్తున్నాయి. దీనితో అవసరమైన సమయంలో తమకు కావాల్సిన పచ్చడిని ఒక్కో ప్యాకెట్, బాటిల్ పచ్చడిని కొనుగోలు చేసుకుంటున్నారు.

ప్రతి వేసవిలో తయారీ



ఆవకాయ ఊరగాయ అంటే అమితంగా ఇష్టం. ప్రతి వేసవికి మామిడికాయ ఊరగాయను తయారుచేస్తాం. మా ఇంటిల్లిపాది మామిడికాయ ఊరగాయను భోజన సమయంలో ఉపయోగిస్తాం. దానికితోడు అత్యవసర సమయాలలో ఊరగాయ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మామిడి రేటు అధికంగా ఉంది. ఈ కారణంగా పచ్చడి పెట్టుకోవడంలో ధరాభారం పడుతోంది.

– ఎం.సుగుణవేణి, కొత్తపేట, రాయచోటి

స్వయంగా తయారు చేసుకుంటాం



మా ఇంట్లో వారందరము ఆవకాయ ప్రియులం. మార్కెట్లో దొరికే ఆవకాయ కంటే స్వయంగా తయారుచేసుకునే ఆవకాయలోనే ఎంతో రుచి ఎక్కువగా ఉంటుంది. పక్కా ప్లాన్ ప్రకారం చేయడంతో ఆవకాయ ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పాటు మంచి రుచి కూడా ఉంటుంది. ఏడాదికి సరిపడా ఊరగాయను వేసవిలో తయారు చేసుకుంటాం. బంధువులకు పంపుతుంటాం.

– కంట్రా ఈశ్వరమ్మ, పాత రాయచోటి

మామిడి మండీల పరిశీలన


రాయచోటిలోని మామిడికాయ మండీలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాయచోటి జగదాంబ సెంటర్ : ఈ నెల 5వ తేదీన సాక్షి దినపత్రికలో 'మధుర ఫలం.. విషతుల్యం' అనే శీర్షికతో వెలువడిన కథనానికి జిల్లా స్థాయి అధికారుల నుంచి స్పందన లభించింది. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రతా అధికారి డా.కె.షమీమ్ బాషా, జిల్లా అగ్రికల్చర్ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ టి.త్యాగరాజులు గురువారం రాయచోటి పట్టణం సుండుపల్లె రోడ్డులో ఉన్న మామిడి కాయల మండీలను పరిశీలించారు. పండ్లను విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేసి వారికి పండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు ఆరోగ్యానికి హానిచేసే రసాయనాలను వాడకూడదని, మామిడి పండ్లు త్వరగా పండటానికి ప్రాణాంతకమైన క్యాల్షియం కార్బైడ్ పొడి మామిడి పండ్లపై చల్లరాదని సూచించారు. తనిఖీలలో ఎక్కడా రసాయనాలు కానీ కాల్షియం కార్బైడ్ పొడి కానీ పండ్ల వ్యాపారస్తులు వాడుతున్నట్లు కనిపించలేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి మాచుపల్లె శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల


రేణుకా యల్లమాంబ మూలవిరాట్

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన జగజ్జనని శ్రీ రేణుకా యల్లమాంబ తిరునాల ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగునని గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన తెల్లవారుజామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుననున్నారు. 13న రాత్రి అమ్మవారి ఊరేగింపు, అనంతరం ఆర్కెస్ట్రా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రేణుకా యల్లమ్మ కల్యాణోత్సవం, కోలాట భజనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సింహ వాహనంపై ఊరేగింపు, అమ్మవారి కథ ఉంటుందన్నారు. తరువాత పాటల కచేరి ఉంటుందన్నారు. 15వ తేదీ అమ్మవారికి బోనాలు సమర్పణ, కోలాటం, ఊరేగింపు ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగునన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన యడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.1,00,116, రెండవ బహుమతి రూ.70,116, మూడవ బహుమతి రూ.50,116, నాల్గవ బహుమతి రూ.30,116, ఐదవ బహుమతి రూ.20,116లు అందజేస్తామన్నారు. రాత్రి శేష వాహనంపై అమ్మవారి ఊరేగింపు, చెక్క భజనలు, పండరి భజనలు జరుగుతాయన్నారు. 16వ తేదీన ఉదయం అమ్మవారి ఊరేగింపు, వసంతోత్సవం ఉంటుందన్నారు. కావున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని గ్రామ పెద్దలు కోరారు. ప్రతి రోజు కడప రాజా జ్యువెలర్స్ యజమాని జరుగు రాజశేఖర్‌రెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని తెలియజేశారు.

భద్రతా చర్యలపై అవగాహనకే మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్‌లో ఫోమ్ మానిటరింగ్ ద్వారా మంటలను అదుపులోకి తెస్తున్న సిబ్బంది

సిద్దవటం : ప్రమాదాల సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన భద్రతా చర్యలు తెలిపేందుకు మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగపడుతాయని కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విపత్తుల సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలో సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్‌లోని ఇథనాల్ గాంట్రీలో ట్రక్ అన్‌లోడింగ్ ముందు టూల్స్ కిట్టు కింద పడటంతో మంటలు చెలరేగాయి. గాంట్రీలో ఉన్న కార్మికుడు ముందుగా డీసీపీని వాడటం జరిగింది. మంటలు ఎక్కువగా చెలరేగడంతో ఫైర్ అని గట్టి కేకలు వేయడంతో అక్కడ ఉన్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది ఫైర్ ఎక్కడో చూసుకొని సైరన్ మోగించారు. సిబ్బంది అప్రమత్తమై వాటర్, ఫోమ్ మానిటర్ సహాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అక్కడ ఉన్న ముగ్గురు వర్కర్‌లకు ప్రమాదం జరగడంతో వారిని స్ట్రెచర్ సాయంతో సిబ్బంది మెడికల్ క్యాంపు వద్దకు తీసుకొచ్చే సన్నివేశాలను మాక్‌డ్రిల్ చేసి చూపించారు. అక్కడ ఉన్న వైద్యుడు శివకుమార్ పరీక్షించి ఒకరికి సీరియస్‌గా ఉండటంతో అతన్ని రిమ్స్ ఆసుపత్రికి తరలించే సన్నివేశాన్ని చేశారు. ఈ సందర్భంగా కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిల్లో మంటలను ఎలా ఎదుర్కోవాలో తెలపడం కోసం అత్యవసర మాక్ డ్రిల్‌ను నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్, ఆర్‌ఎం మన్మధరావు, వీడీపీఎల్ డీజీఎం ఓబయ్య, వైద్యుడు డాక్టర్ శివకుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సిద్దారెడ్డి, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, వీడీపీఎల్ పైప్‌లైన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

- రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని కాంట్రాక్టర్, ట్రాన్స్‌కో అధికారులు


హైవే పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి – లక్కిరెడ్డిపల్లి మార్గ మధ్యలోని లక్కిరెడ్డిపల్లికి కూతవేటు దూరంలో పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఆనుకొని హైవే కాంట్రాక్టర్ రోడ్డు పనుల్లో భాగంగా మట్టిని తోలి చదను చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకొని ఉండటంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు జాగ్రత్తలు పాటించకపోతే అంతే సంగతులు. రాత్రి సమయాల్లో పొరపాటునో, గ్రహపాటునో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొంటే మాత్రం జరగాల్సిన నష్టం జరిగిపోయి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలవక తప్పదు. నాలుగు రోజులుగా రోడ్డుకు ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్ కనిపిస్తున్నా అటు హైవే కాంట్రాక్టర్ గానీ, ట్రాన్స్‌కో అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోకపోవడం వారి అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. జరగాల్సిన నష్టం జరగక ముందే ట్రాన్స్‌కో అధికారులు మేల్కొని ట్రాన్స్‌ఫార్మర్‌ను మరొక ప్రదేశంలో మార్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

'ఆపరేషన్ సింధూర్' దేశ బలాన్ని ప్రపంచానికి చాటింది


అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థుల ర్యాలీ

రాజంపేట : భారత సైన్య శౌర్యాన్ని స్మరించుకుంటూ, దేశభక్తిని చాటుతూ అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు గురువారం ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏయూ అధ్యాపకులు, విద్యార్థులు, హెచ్ఓడీలు, వివిధ అనుబంధ సంస్థల ప్రిన్సిపల్స్, ఏయూ సిబ్బంది పాల్గొన్నారు. దేశ భక్తి నినాదాలతో ర్యాలీ సాగింది. భారత రక్షణ బలగాలకు మద్దతుగా నిలిచే విద్యా సముదాయ స్వరాన్ని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డా. సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ భారతదేశ బలాన్ని ప్రపంచానికి చాటుతోందని ప్రశంసించారు. ఏబీటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పూర్తి స్థాయిలో అంతమొందించాలన్నారు. ఆ దిశగా సైనికులు చేస్తున్న పోరాట పటిమ అద్భుతనీయమైనదన్నారు. రిజిస్ట్రార్ ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ దేశం ఎప్పుడూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమై నిలుస్తుందన్నారు. తన సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు నిరంతరం పోరాడుతుందన్నారు. ప్రిన్సిపల్ నారాయణ మాట్లాడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచం ఒకే స్వరంతో ఉండాలన్నారు. శాంతి పరిరక్షణకు అంతర్జాతీయ మద్దతు అవసరమన్నారు. ర్యాలీ ముగింపులో దేశ ఐక్యత, సహనం, సైనిక బలగాలకు అపారమద్దతు అనే స్పష్టమైన సందేశం వెల్లివిరిసింది. కార్యక్రమం విశ్వవిద్యాలయం జాతీయ సమగ్రత పట్ల ఉన్న నిబద్ధతను చాటడమే కాకుండా, విపత్తులపై భారతదేశం ఏకతాటిపై ఎలా స్పందిస్తుందో ప్రపంచానికి తెలియజేసింది.

ఆధునిక వరి వంగడంతో అధిక దిగుబడి

నిమ్మనపల్లె : ఆధునిక వరి వంగడాలతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనపల్లె వ్యవసాయ సహాయ సంచాలకు కె.శివశంకర్ అన్నారు. నిమ్మనపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలోని నాగంవారిపల్లె రైతు సిజీ.రాజారెడ్డి పొలంలో ఎస్ఎల్ఆర్–3648 చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఏవో మురళీమోహన్, కేవీకే శాస్త్రవేత్త వై.పీరుసాహెబ్‌లతో కలిసి పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతు రాజారెడ్డి కలికిరి కేవీకే నుంచి నాలుగు కిలోల నూతన వరి వంగడం ఎస్ఎల్ఆర్–3648 విత్తనాలు తెచ్చి 120 రోజుల కాలపరిమితితో సాగు చేశారన్నారు. తుఫానుల ధాటికి నేల వాలకుండా ఉంటుందని పేర్కొన్నారు. నూతన రకంలో కాండం తొలుచు, అగ్గి తెగుళ్ల వృద్ధిని తట్టుకొని పంట పెరుగుతుందన్నారు. ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చన్నారు. ఆర్ఎన్ఆర్–15048తో పోల్చి చూస్తే ఎస్ఎల్ఆర్–3648 అధిక దిగుబడిని నమోదు చేసిందన్నారు. ప్రజలు ఆధునిక వరి రకం వైపు మొగ్గుచూపి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ డిప్యూటీ ఈఓకు తీవ్రగాయాలు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామస్వామి దేవాలయం టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు గురువారం రాత్రి 10 గంటల సమయంలో రాజంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు జమ్మలమడుగులోని నారాపుర వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి జరుగనుండటంతో ఏర్పాట్లపై ఆయన సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం తిరుపతికి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణిస్తున్న కారు రాజంపేట బైపాస్‌లోని జగన్‌మోహన్ ఆస్పత్రి వద్దకు రాగానే గ్యాస్ లారీని ఢీకొంది. దీంతో డిప్యూటీ ఈఓ నటేష్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం ఆయన్ను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని రాజంపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్టు సమాచారం.

వ్యాయామంతో క్రమశిక్షణ

కడప ఎడ్యుకేషన్: క్రమశిక్షణకు, చక్కటి శరీర సౌష్టవానికి ఎన్.సి.సి డ్రిల్ ఉపయోగపడుతుందని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో నిర్వహిస్తున్న ఎన్.సి.సి ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఎన్.సి.సి క్యాడెట్లకు రైఫిల్ డ్రిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కల్నల్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగడానికి అవసరమైన అన్ని లక్షణాలను క్యాడెట్లు ఈ క్యాంపులో నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జే. ఆత్రే, ఎన్.సి.సి అధికారులు కెప్టెన్. డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్, పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్, సీ.ఎల్. రెడ్డి, కొండా రెడ్డి, గర్ల్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ మిశ్రా, ఆఫీస్ సూపరింటెండెంట్ డేవిడ్, ఉమా, మల్లేశ్వరి, శివప్రసాద్, రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం చిప్పిలిలోని సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం మహాగణపతి హోమం, పూర్ణాహుతి జరిపి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోని కళ్యాణమండపం వద్ద వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది. సాయంత్రం ఉత్సవమూర్తులను అలకరించి వాహనంలో చిప్పిలిలో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు పట్టి.. స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అమరనాథ్, రామకృష్ణ, దివాకర్, కుమారస్వామి, శివశంకర్, కోదండరామయ్య, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాగేటమ్మ తిరునాల


భక్తులకు దర్శనమిస్తున్న పాగేటమ్మ


జాతరలో ఆకట్టుకున్న కోలాటాలు, చాందినీ బండ్లు

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ గాండ్లపల్లె సమీపంలో కొలువైన శ్రీ పాగేటమ్మ తిరునాల గురువారంతో ముగిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు గావించారు. ఈ క్రమంలో మొక్కులు తీరిన భక్తులు చాందినీ బండ్లు కట్టి ఆలయ ప్రాంగణం చుట్టూ తిప్పారు. అంతేకాకుండా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో తిరునాలలో కొత్త శోభ సంతరించుకొంది. జాతరలో మండల పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లి : ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఉషారాణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో వ్యవసాయం ఉద్యానవన మహిళా సమాఖ్యలకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయబోయే రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రణాళిక తయారు చేసుకొని ముందుగా ప్రకృతి ఎరువులు పొలాలకు నింపుకొని లోదుక్కులు చేయాలన్నారు. లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ అధికారి రమేష్ బాబురావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌కు ప్రణాళిక ప్రకారం వేసవిలో దుక్కులు, మట్టి నమూనా ఎక్కువగా ప్రకృతి ఎరువులు వాడే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు కూడా గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ యశోద, హరిప్రియ, భావన, ఏపీఎం నిరంజన్, ఎంపీలు సరస్వతి, రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చంద్రమోహన్, నాగమణి గంగిరెడ్డి, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కూలీలు కోరిన వెంటనే పనులు

తంబళ్లపల్లె : ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు కోరిన వెంటనే పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. మండలంలోని రెడ్డికోటలో గురువారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. సప్లయ్ ఛానల్ పని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. జరిగిన పనులకు వెంటనే కొలతలు తీసి సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చూడాలన్నారు. రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.